క్లుప్తంగా

పారిశుద్ధ్య కార్మికులను నియమించాలి



పేరుకుపోయిన కాలువను చూపుతున్న సీపీఎం నాయకులు

కర్నూలు(సెంట్రల్): నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా పారిశుద్ధ్య కార్మికులను నియమించాలని సీపీఎం డిమాండ్ చేసింది. శనివారం 27వ వార్డు అబ్బాస్‌నగర్‌లో పార్టీ నాయకులు లక్ష్మయ్య, అక్బర్, దేవేంద్ర, రవికుమార్, శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. అలాగే ఓల్డ్‌సిటీలో ఎస్ఎండీ షరీఫ్, అబ్దుల్‌దేశాయ్ ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర కొనసాగింది. ఎక్కడ చూసినా కాలువల్లో చెత్త పేరుకుపోయిందని, వాటిని శుభ్రం చేసే నాథుడే కనిపించడం లేదన్నారు. మార్చి 26వ తేదీన చేపట్టే మునిసిపల్ కార్యాలయ ముట్టడికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు.

స్వీపర్‌కు మెరుగైన వైద్యం అందించాలి

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో విధి నిర్వహణలో రసాయన ద్రావణం పడి గాయపడిన స్వీపర్ ఆశీర్వాదమ్మకు మెరుగైన వైద్యం అందించాలని, ఆమెకు జీతంతో కూడిన సెలవులు ఇవ్వాలని సీఐటీయూ నగర ప్రధాన కార్యదర్శి విజయ రామాంజనేయులు డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను శనివారం ఆయన పరామర్శించారు. ట్రమాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న ఆశీర్వాదమ్మపై పగిలిపోయిన డబ్బాలో ఉన్న లైజాల్ అనే ద్రావణం ప్రమాదవశాత్తూ మీద పడి కాలిన గాయమైందన్నారు.

రేపు వైద్యమిత్రల శాంతియుత ఆందోళన

కర్నూలు(హాస్పిటల్): తమ డిమాండ్ల పరిష్కారం కోసం వైద్య మిత్రలు ఈ నెల 24వ తేదీన ఎన్‌టీఆర్ వైద్యసేవ ట్రస్ట్ జిల్లా కో ఆర్డినేటర్ కార్యాలయం వద్ద శాంతియుత నిరసన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఏపీ వైద్యసేవ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి.నాగరాజు, రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ కె.దేవేంద్రనాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డాక్టర్ ఎన్‌టీఆర్ వైద్య సేవ పథకంలో గత 17 సంవత్సరాలుగా పని చేస్తున్నామని, సమస్యల పరిష్కారం కోసం పలుమార్లు ఆందోళనలు చేసినా ఫలితం లేదన్నారు. రెండు సోమవారాల నుంచి ఆందోళనలు నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా 24వ తేది గాంధేయ పద్ధతిలో నిరసన తెలియజేస్తామన్నారు.

ఈ నెల 29 నుంచి సీసీ రోడ్లు ప్రారంభం

కర్నూలు(అగ్రికల్చర్): జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన సీసీ రోడ్లను ఈ నెల 29 నుంచి ప్రారంభించనున్నట్లు జిల్లా నీటియాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ వెంకటరమణయ్య తెలిపారు. గత ఏడాది అక్టోబరు 14 నుంచి 20 వరకు పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా సీసీ రోడ్లు, పశువుల షెడ్ల పనులకు శ్రీకారం చుట్టామన్నారు. వీటిని ఈ నెల 29 నుంచి ప్రారంభించే విధంగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... జిల్లాలో 119.70 కిలోమీటర్ల మేర సీసీ రోడ్ల పనులు చేపట్టి...116.72 కిలోమీటర్ల మేర పూర్తి చేశామన్నారు.

శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై అదనపు కమిషనర్ సీరియస్

కర్నూలు (టౌన్): ట్రేడ్ లైసెన్సుల బకాయిలు వసూలు చేయడంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్లపై నగరపాలక అదనపు కమిషనర్ ఆర్‌జీవీ కృష్ణ సీరియస్ అయ్యారు. మొత్తం 17 మంది శానిటరీ ఇన్‌స్పెక్టర్లకు శనివారం సాయంత్రం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. మరో 8 రోజుల వ్యవధిలో మార్చి నెల ముగుస్తున్నా.. ఇప్పటికి ట్రేడ్ లైసెన్సుల బకాయిలు రూ.3,61,37,985 వసూలు చేయాల్సి ఉంది. మరొక చోట ఏడేళ్లుగా అసలు ట్రేడ్ లైసెన్సులను వసూలు చేయకపోవడం గమనార్హం.

సాక్షి సినిమాలు



ఎస్వీసీ కాంప్లెక్స్ : ఛావా, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, పెళ్లి కాని ప్రసాద్, సలార్ పార్ట్1 – సీజ్ ఫైర్, షణ్ముఖ, ఎవడే సుబ్రహ్మణ్యం (2015)
వి మెగా ఆనంద్ సినీ కాంప్లెక్ : టక్ టక్, కిస్ కిస్ కిస్సిక్, షణ్ముఖ, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, పెళ్లి కాని ప్రసాద్, ఓ అందాల రాక్షసి, ఆర్టిస్ట్
వెంకటేష్ సినీ కాంప్లెక్స్ : ఛావా, కోర్ట్ : స్టేట్ వర్సెస్ నోబడీ, పెళ్లి కాని ప్రసాద్
శ్రీరామ : ల్యాంప్
రాజ్ : సలార్ పార్ట్1 – సీజ్ ఫైర్
భరత్ కాంప్లెక్స్ : తండేల్, కాలమేగా కరిగింది?
విజయ థియేటర్ : మజాకా
విక్టరీ టాకీస్ : దిల్‌రూబా

మనసు గతి తప్పుతోంది!

- పెరుగుతున్న మానసిక వ్యాధి బాధితులు
- శారీరక, మానసిక, విద్య, ఆర్థిక సమస్యలే కారణం
- విధుల్లో పని ఒత్తిడితో సతమతం
- కోవిడ్ అనంతరం మరిన్ని సమస్యలు
- గతేడాది జీజీహెచ్‌లో 26వేల మందికి చికిత్స

ఒకప్పుడు రోడ్లపై బట్టలు చింపుకుని గెంతుతూ తిరిగే వారిని మాత్రమే పిచ్చోళ్లు/మానసిక వ్యాధిగ్రస్తులుగా పేర్కొనేవారు. కాలక్రమేణా దీనికి అర్థం మారిపోయింది. ఏదైనా విషయం గురించి అదేపనిగా మదన పడుతూ భవిష్యత్ ఎలాగుంటుందో, జరిగే పనివల్ల పర్యవసనాలు ఎలా గుంటాయోనని ఒకటే ఆందోళన పడే వారిని కూడా ఇప్పుడు మానసిక వ్యాధి బాధితులంటున్నారు. ఇలాంటి వారికి చికిత్స అందించకుండా వదిలేస్తే భవిష్యత్‌లో తీవ్ర డిప్రెషన్‌కు గురై ఆత్మహత్యాయత్నాలకు ప్రయత్నించే అవకాశం ఉంది. సమాజంలో ఇలాంటి వారి సంఖ్య ప్రస్తుతం అధికమైంది.

కర్నూలు(హాస్పిటల్): కుటుంబ సమస్యలతో పాటు ఆరోగ్య, ఆర్థిక సమస్యలు, చదువు, ఉద్యోగాల్లో ఒత్తిళ్లు, వ్యాపారాలు సరిగ్గా జరగకపోవడం, బెట్టింగ్ యాప్‌ల్లో మోసపోవడం, నమ్మిన వారే మోసగించడం తదితర కారణాలతో తీవ్ర మానసిక సమస్యలతో బాధపడుతున్న వారు ఇటీవల పెరుగుతున్నారు. పాతికేళ్ల క్రితం ఉమ్మడి జిల్లాలో ఇద్దరు, ముగ్గురు మాత్రమే మానసిక వైద్యులు ఉండేవారు. కోవిడ్ అనంతరం బాధితుల సంఖ్య పెరగడంతో మానసిక డాక్టర్ల సంఖ్య కూడా 40 దాటింది. కర్నూలు, నంద్యాల, డోన్, ఆదోని, ఎమ్మిగనూరులలో మానసిక వైద్యులు పుట్టుకొస్తున్నారు. వీరితో పాటు సైకాలజిస్టులు తమ కౌన్సిలింగ్ ద్వారా రోగులను నయం చేసే ప్రయత్నం చేస్తున్నారు. ఏడాది క్రితం వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని సైకియాట్రి విభాగానికి రెండు పీజీ సీట్లు కూడా మంజూరు చేయడంతో మూడేళ్లకు ఇక్కడ ఆరుగురు పీజీలు చదువు నేర్చుకుంటూ వైద్యం అందిస్తున్నారు. ఈ ఆసుపత్రిలోని మానసిక వ్యాధుల విభాగానికి ప్రతిరోజూ ఓపీకి 100 నుంచి 120 మంది వరకు చికిత్స కోసం వస్తుండగా , ఇన్‌పేషంట్లుగా 30 మంది 35 మంది దాకా చేరుతున్నారు. ఓపీ చికిత్స కోసం వచ్చేవారిలో 60 శాతం మంది కొత్తవారు ఉంటున్నారు. ప్రైవేటుగా చికిత్స చేసే వైద్యుల వద్దకు సైతం ఒక్కొక్కరి వద్దకు రోజూ 40 నుంచి 80 మంది వరకు వెళ్తున్నారు. వీరి వద్దకు వెళ్తున్న వారిలో అధికంగా స్కిజోఫీనియా, మానియా, డిప్రెషన్, ఆందోళన, ఒత్తిడి, నిరాశ, నిస్పృహ, బైపోలార్ డిజార్డర్, అతిగా మద్యపానం, మత్తుపదార్థాలు సేవించడం, ఆత్మహత్య చేసుకోవాలనుకోవడం, గృహ హింసలతో బాధపడేవారు ఉన్నారని వైద్యులు చెబుతున్నారు. వారిలో ఉన్న లక్షణాల ఆధారంగా కౌన్సెలింగ్, మందుల ద్వారా వైద్యులు నయం చేస్తున్నారు.





పెద్దాసుపత్రిలో ఆరేళ్లలో ఓపీ రోగుల సంఖ్య

సంవత్సరం	ఓపీ రోగుల సంఖ్య
2019	20,054
2020	13,365
2021	15,942
2022	19,475
2023	22,887
2024	26,295

ఇలా చేస్తే ప్రయోజనం

- ఉదయాన్నే వాకింగ్ చేస్తే మనసుకు ప్రశాంతత లభిస్తుంది
- వాకింగ్ చేస్తూ మనసుకు నచ్చిన పాటలు వినాలి
- ఒంటరిగా గాకుండా స్నేహితులతో వాకింగ్ చేసినా మంచి ప్రయోజనం ఉంటుంది
- వాకింగ్‌కు వీలుగాని వారు జిమ్‌కు వెళ్లవచ్చు. దీనివల్ల శరీర దారుఢ్యం మెరుగుపడి వ్యక్తిగతంగా, మానసికంగా ధృడంగా మారతారు.
- యోగా, ధ్యానం చేయడం ద్వారా శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ప్రశాంతత లభిస్తుంది.
- వీలైనప్పుడల్లా కుటుంబ సభ్యులు, స్నేహితులతో కలిసి విహార యాత్రలు చేయాలి.
- రోజులో ఒక్కసారైన ఇష్టమైన స్నేహితులను కలిసి మాట్లాడుకోవాలి
- పనిచేసే ప్రదేశంలో సహచరులతో ఉల్లాసంగా ఉండేందుకు ప్రయత్నించాలి

మానసిక సమస్యలతో నష్టాలు

మానసిక ఒత్తిడి వల్ల కడుపులో గ్యాస్(వాయువు), ఆవేశకావేశాల వల్లే అధిక రక్తపోటు, అతిబద్ధకం వల్ల చెడు కొలెస్ట్రాల్ ఎక్కువగా పెరగడం, అధిక స్వార్థం, మొండితనం వల్ల డయాబెటీస్(మధుమేహం), అతి విచారం వల్ల ఆస్తమా, ప్రశాంతత లోపించడం వల్లే గుండెకొట్టుకోవడంలో మార్పులు వస్తున్నాయని ఇటీవల వైద్యులు గుర్తించారు. మొత్తంపై శరీరంలో వచ్చే సర్వరోగాలకు మూలకారణాలు తరచిచూస్తే ఆహార అలవాట్లతో పాటు అధిక శాతం జీవనశైలి సంబంధమైనవేనని తెలుస్తోంది.

కారణాలు కనుగొని చికిత్స అందిస్తున్నాము



ఇటీవల కాలంలో మానసిక జబ్బులతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. అంచనాలకు తగ్గట్లు లక్ష్యాలు సాధించలేకపోవడం, కుటుంబ, ఆర్థిక, చదువు, ఉద్యోగం, సమాజంలో సంఘటనలు వంటి వాటి వల్ల మానసిక జబ్బులకు గురవుతున్నారు. ఇందులో ఎక్కువగా కుటుంబ సమస్యలే ఉంటున్నాయి. మా వద్దకు వచ్చిన వారి సమస్యలు, లక్షణాలను బట్టి కారణాలు కనుగొని, వ్యాధికి అనుగుణంగా చికిత్స అందిస్తున్నాము. డీ అడిక్షన్ సెంటర్‌లోనూ ఆల్కహాలు, మద్యపానం మానేసే వారికి ఉచితంగా చికిత్స అందిస్తున్నాము.
–డాక్టర్ నాగేశ్వరరావు, మానసిక వ్యాధుల విభాగాధిపతి, పెద్దాసుపత్రి, కర్నూలు

మర్యాదపూర్వక భేటి

కర్నూలు(సెంట్రల్): కర్నూలు వచ్చిన హైకోర్టు జడ్జీలు జస్టిస్ బి.ఎస్.భానుమతి, కె.శ్రీనివాసరెడ్డిలను జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్ మర్యాదపూర్వకంగా కలిశారు. శనివారం ఉదయం రాష్ట్ర ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్న వారిని కలసి బొకేలు అందించారు. అనంతరం హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బీఎస్ భానుమతితో భేటి అయ్యారు. పలు అంశాలపై మాట్లాడారు.



హైకోర్టు జడ్జి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి బీఎస్ భానుమతితో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.కబర్ధి, కలెక్టర్ రంజిత్‌బాషా, ఎస్పీ విక్రాంత్‌పాటిల్

సిలార్ సాహెబ్ మసీదులో ఎస్వీ ప్రార్థనలు



ఇఫ్తారు విందులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీమోహన్ రెడ్డి

కర్నూలు (టౌన్) : నగరంలోని 6 వ వార్డుకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు కిషన్, నసీం, షేక్ అహ్మద్, బాసిత్, మస్తాన్, షాహిద్, అజీబుల్లా, రెహమాన్ ఆహ్వానం మేరకు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్ రెడ్డి బేకార్ కట్టలోని సిలార్ సాహిబ్ మసీదులో శనివారం సాయంత్రం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. తర్వాత రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని ముస్లింలతో కలిసి ఆయన ఇఫ్తారు విందులో పాల్గొన్నారు.

ముగ్గురు పిల్లలకు ఆర్థిక సహాయం

కర్నూలు(సెంట్రల్): ఓర్వకల్ మండలం పూడిచెర్లకు వచ్చిన డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు తమ పిల్లలకు వైద్యం చేయించాలని వికలత్వంతో బాధపడుతున్న చిన్నారుల తల్లిదండ్రులు అభ్యర్థించారు. అందుకు ఆయన స్పందించి తక్షణ సాయంగా ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున ముగ్గురికి ఇవ్వాలని ఆదేశించడంతో కలెక్టర్ పి.రంజిత్‌బాషా శనివారం సాయంత్రం తన కార్యాలయంలో బాధిత పిల్లలు, వారి తల్లిదండ్రులకు చెక్కులు అందజేశారు.

పరిసరాల శుభ్రతపై అవగాహన

కల్లూరు: కర్నూలు ప్రభుత్వ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. శనివారం సల్కాపురంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చార్టుల ద్వారా అంటు వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను స్థానికులకు వివరించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మంజుల రాణి మాట్లాడుతూ.. పరిసరాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత అవసరం అన్నారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ అన్నపూర్ణ, నాగరత్న తదితరులు పాల్గొన్నారు.

ఖజాన శాఖ డైరెక్టర్ మోహన్‌రావుకు సత్కారం



ఖజాన శాఖ డైరెక్టర్ మోహన్‌రావును సత్కరిస్తున్న ఎన్‌జీఓ అసోసియేషన్ నేతలు

కర్నూలు(అగ్రికల్చర్): ఖజాన, లెక్కల శాఖలో ఇటీవల 52 మంది సీనియర్ అకౌంటెంట్లు, ఎస్‌టీఓలకు పదోన్నతులు కల్పించిన డైరెక్టర్ మోహన్‌రావును ఏపీ ఎన్‌జీఓ అసోసియేషన్ ఉమ్మడి జిల్లా శాఖ ప్రతినిధులు అభినందించారు. జిల్లా ట్రెజరీ, సబ్ ట్రెజరీల్లో 2024–25 సంవత్సరంలో చేపట్టిన లావాదేవీలపై వార్షిక తనిఖీలను పర్యవేక్షించేందుకు వచ్చిన డైరెక్టర్‌ను శనివారం ఉదయం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వీసీ హెచ్ వెంగళ్‌రెడ్డి ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఉద్యోగుల సంక్షేమానికి ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటుండటం హర్షనీయమని పేర్కొన్నారు. ఖజాన శాఖ ప్రదాన కార్యాలయంలో పనిచేసేందుకు అన్ని జిల్లాలకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. ఇందుకు డైరెక్టర్ మోహన్‌రావు స్పందిస్తూ... ఉద్యోగ,ఉపాధ్యాయ, కార్మికుల సంక్షేమానికి తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో జిల్లా ఖజాన అధికారి రామచంద్రరావు,ఎస్‌టీఓ పలనాటి సునీల్, ఎన్‌జీవో అసోసియేషన్ జిల్లా కార్యదర్శి కేసీహెచ్ కృష్ణుడు, నగర శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ కాశన్న, రామకృష్ణ, జిల్లా అసోసియేట్ ప్రెసిడెంటు ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు రవిప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ రామకృష్ణారెడ్డి సేవలు చిరస్మరణీయం

కర్నూలు(హాస్పిటల్): కర్నూలు మెడికల్ కాలేజి పూర్వ ప్రిన్సిపాల్‌గా, కార్డియాలజి విభాగాధిపతిగా డాక్టర్ రామకృష్ణారెడ్డి అందించిన సేవలు చిరస్మరణీయమని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.చిట్టినరసమ్మ కొనియాడారు. ఇటీవల మరణించిన డాక్టర్ టి. రామకృష్ణారెడ్డి సంతాప సభ శనివారం కళాశాలలోని ఓల్డ్ సీఎల్‌జీలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కార్డియాలజి విభాగంలో మొదటిసారిగా ఐసీయూ విభాగాన్ని ఏర్పాటు చేశారని, అధునాతన చికిత్సలు నిర్వహించారని కొనియాడారు. రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి. చంద్రశేఖర్ మాట్లాడుతూ కార్డియాలజి విభాగానికి డాక్టర్ రామకృష్ణారెడ్డి అందించిన సేవలు ఎప్పటికీ మరువలేమని, వారి ద్వారా ఎంతో మంది వైద్య మెళకువలు నేర్చుకున్నారని, అందులో తాను కూడా ఒకడినని గుర్తు చేసుకున్నారు. డాక్టర్ రామకృష్ణారెడ్డి కుమారుడు డాక్టర్ విజయకృష్ణారెడ్డి మాట్లాడుతూ తన తండ్రి పేరు మీద కార్డియాలజి విభాగంలో బెస్ట్ అవుట్ గోయింగ్ పీజీకి గోల్డ్‌మెడల్ అందిస్తామని ప్రకటించారు. ఆ విభాగానికి 30 కాట్స్(మంచాలు) అందజేస్తామన్నారు. అనంతరం ఇటీవల మరణించిన వైద్యవిద్యార్థిని రమ్యతేజకు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సాయిసుధీర్, డిప్యూటీ సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీరాములు, వైద్యులు శ్రీనివాసులు, లక్ష్మీబాయి, రాధారాణి, రాంశివనాయక్, దమామ్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



డాక్టర్ రామకృష్ణారెడ్డి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైద్యులు

ఈ రోజు

రామాంజనేయ యుద్ధం నాటకం

కర్నూలు(సెంట్రల్): టీజీవీ కళాక్షేత్రంలో సాయంత్రం 6.30 గంటలకు రామాంజనేయ యుద్ధం వార్ సీన్ ప్రదర్శన ఉంటుందని ఆ కళాక్షేత్రం అధ్యక్షుడు పత్తి ఓబులయ్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాయలసీమ రత్నం నటకిరీటి వెల్దుర్తి వెంకట నర్సునాయుడు వర్ధంతి సందర్భంగా ఈ ప్రదర్శన ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో శ్రీరాముడిగా అనంతపురానికి చెందిన ధూపం తిరుమలతేజ, ఆంజనేయులుగా విజయనగరం బొబ్బిలినాయుడు పాల్గొంటారని వెల్లడించారు.

పెద్దాసుపత్రిలో కరెంటు కోతలు

కర్నూలు(అగ్రికల్చర్): నగరంలో విద్యుత్ లైన్లను సంబంధించి అభివృద్ధి పనులు చేపడుతున్నందున ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పెద్దాసుపత్రిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని విద్యుత్ శాఖ కర్నూలు టౌన్ డీఈ నాగప్రసాద్ తెలిపారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల ప్రాంగణంలోని కంటి ఆసుపత్రి, క్యాన్సర్ హాస్పిటల్, మహిళ ప్రాంగణంలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉల్లాస్ అక్షరాస్యత అర్హత పరీక్ష

కర్నూలు సిటీ: జాతీయ సార్వత్రిక విద్యా పీఠం సహకారంతో వయోజన విద్య ఉల్లాస్ కార్యక్రమంలో నమోదు అయిన వయోజనులకు ఆదివారం అక్షరాస్యత అర్హత పరీక్ష నిర్వహించనున్నట్లు జిల్లా వయోజన విద్య డీడీ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. జిల్లాలో మొత్తం 396 కేంద్రాల్లో జరిగే ఈపరీక్షను 9 మండలాల నుంచి 28,654 మంది వయోజనులు రాయనున్నట్లు వెల్లడించారు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల మధ్యలో వారికి వీలైన సమయంలో పరీక్ష రాసే సదుపాయం కల్పించినట్లు డీడీ శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

పన్ను వసూళ్లకు ప్రత్యేక కౌంటర్ల ఏర్పాటు

కర్నూలు (టౌన్): మార్చి నెల ముగుస్తున్న నేపథ్యంలో పన్నుల వసూళ్లకు అదనంగా మూడు కౌంటర్లు ఏర్పాటు చేసినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ రవీంద్రబాబు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. పన్నుదారుల సౌకర్యార్థం ఆదివారం సైతం ఈ కౌంటర్లు పనిచేస్తాయని, ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు తమ పన్నులు చెల్లించుకోవచ్చని కమిషనర్ తెలిపారు. అలాగే ఇంటి వద్ద నుంచే డిజిటల్ ప్లాట్‌ఫాంలలో పన్నులు చెల్లించవచ్చని, వాట్సాప్ నెంబర్ 9552300009, పుర సేవ యాప్ వెబ్‌సైట్ htt p://cdma.ap.gov.in/en/ pt paymentsలలో ఏదైనా ఒక పద్ధతిలో పన్నులు చెల్లించవచ్చని తెలిపారు. నగదు రూపంలో చెల్లించాలనుకునే పన్నుదారులు స్థానిక సచివాలయం, మీ–సేవ, ఆన్‌లైన్ కేంద్రాల్లో పన్నులు చెల్లించవచ్చని తెలిపారు.

ప్రత్యేక కౌంటర్లు ఎక్కడంటే..
కల్లూరులో – 85వ సచివాలయం
జేఎస్ఆర్ నగర్ (సి.క్యాంప్) – 62వ సచివాలయం
బాలాజీ నగర్ – 104వ సచివాలయం

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- సంచార చికిత్స జిల్లా నోడల్ అధికారి రఘు



టీకాల గురించి తెలుపుతున్న ఆరోగ్య కార్యకర్త

ఓర్వకల్లు: గర్భిణులు, బాలింతలకు వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరిగా వేయించాలని సంచార వైద్య చికిత్స జిల్లా నోడల్ అధికారి రఘు అన్నారు. శనివారం హుసేనాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని తిప్పాయపల్లె పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న సంచార చికిత్స కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణులు, చిన్న పిల్లలకు అందుతున్న వైద్య చికిత్సల గురించి వైద్య ఆరోగ్య సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గర్భిణులు, పిల్లలకు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వల్ల రోగాల భారిన పడకుండా, నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. కాబట్టి సమయానుసారంగా వంద శాతం టీకాలు వేయించాలని సూచించారు. ఈ టీకాలు వేయించడం వల్ల భవిష్యత్‌లో పిల్లలకు ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షణ లభిస్తుందని తెలిపారు. రుబెల్లా, మీజిల్స్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా మీజిల్స్, రుబెల్లా వాక్సిన్‌ను బిడ్డకు 9–16 నెలల వయస్సులో తప్పకుండా వేయించాలని పేర్కొన్నారు. గర్భిణులు ఐరన్, కాల్షియం కలిగిన ఆహార పదార్థాలైన(పండ్లు, పాలు, ఆకుకూరలు, గ్రుడ్లు)ను విరివిగా తీసుకోవడం వల్ల రక్తహీనతకు లోనుకాకుండా ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో వైద్యులు కృష్ణబాయి, సామాజిక ఆరోగ్య అధికారులు సుమలత, యశోద, ఆరోగ్య కార్యకర్తలు పాల్గొన్నారు.


జలసంరక్షణ అందరి బాధ్యత



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

కర్నూలు(అగ్రికల్చర్): జలసంరక్షణ అందరి బాధ్యతని, జలాలను దుర్వినియోగం చేస్తే బావి తరాలకు తీరని అన్యాయం చేసినట్లేనని ప్రాంతీయ పర్యావరణ కాలుష్య నియంత్రణ మండలి ఎన్విరాన్‌మెంటు ఇంజినీర్ పీవీ కిశోర్‌రెడ్డి తెలిపారు. శనివారం నగరంలోని మాంటిస్సోరి హైస్కూల్‌లో ప్రపంచ జలదినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా న్యాయసేవ సమితి, లయన్స్‌క్లబ్, స్పందన స్వచ్ఛంద సంస్థ, పర్యావరణ సంరక్షణ విభాగ్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. విద్యార్థి దశ నుంచి నీటి అవశ్యకతపై అవగాహన పెంచుకోవాలన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండా భూమిలోకి ఇంకింప జేయాలని తెలిపారు. రిటైర్డ్ డీఎఫ్ఓ రాజేంద్ర మాట్లాడుతూ వర్షాలు పడాలంటే మొక్కలు విరివిగా పెంచాలన్నారు. పర్యావరణ సంరక్షణ విభాగ్ ప్రతినిధి తోట హరికృష్ణ మాట్లాడుతూ... విద్యార్థులకు జలసంరక్షణపై అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. జల దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాయపాటి శ్రీనివాస్, అశోకా ఇంజినీరింగ్ కాలేజీ డీన్ మురళీధర్ రెడ్డి, ఏ.క్యాంపు మాంటిస్సోరి స్కూల్ ప్రధానోపధ్యాయులు రమాజ్యోతి, అధ్యాపకులు కేకే ప్రసాద్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రైవేటు ట్రావెల్స్ బస్సు ఢీకొని వ్యక్తి మృతి



ప్రైవేటు ట్రావెల్ బస్సు

కర్నూలు సిటీ: నంద్యాల చెక్‌పోస్ట్ సమీపంలో ప్రైవేటు ట్రావెల్ బస్సు ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. గణేష్‌నగర్‌కి చెందిన కర్రెన్న కుమారుడు మద్దిలేటి(60) శనివారం రాత్రి చెక్‌పోస్టు సమీపంలో రోడ్డు దాటుతుండగా కర్నూలు నుంచి చెన్నైకు వెళుతున్న ప్రైవేటు ట్రావెల్ బస్సు వేగంగా వచ్చి ఢీకొంది. తర్వాత కిందపడిపోయిన అతనిపైనే బస్సు వెళ్లడంతో శరీరం నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంపై ట్రాఫిక్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. మృతుడు కూలీపని చేసుకొని జీవిస్తాడని, కుటుంబ వివరాలు తెలియాల్సి ఉందని ట్రాఫిక్ పోలీసులు తెలిపారు.

కర్ణాటక భక్తులకు సీఆర్ భవన్‌లో ఉచిత వసతి



సీఆర్ భవన్‌లో వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న జగన్నాథం,రామకృష్ణారెడ్డి

కర్నూలు(సెంట్రల్) : కర్ణాటక ప్రాంతం నుంచి శ్రీశైలం వెళ్లే భక్తులకు సీఆర్ భవన్‌లో ఉచిత వసతి ఏర్పాటు చేసినట్లు సీఆర్ సేవాసమితి అధ్యక్షుడు కె. జగన్నాథం, కోశాధికారి పి.రామకృష్ణారెడ్డి తెలిపారు. ఈ సదుపాయాన్ని భక్తులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ కర్ణాటక భక్తు లు విశ్రాంతి తీసుకోవడానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రజానాట్య మండలి జిల్లా కార్యదర్శి నాగరాజు పాల్గొన్నారు.

భక్తులకు మజ్జిగ, అల్పాహారం పంపిణీ

కృష్ణం ధర్మ పరిషత్ ఆధ్వర్యంలో శ్రీశైలం వెళ్లే భక్తులకు వినాయక ఘాట్ సమీపంలో అల్పాహారం, మజ్జిగ, మంచినీరు అందించారు. ఈ కార్యక్రమాన్ని ప్రత్యేక చొరవ తీసుకొని నిర్వహించిన తానేటి అభిషేక్ గౌడ్‌ను రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ కృష్ణం ధర్మ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రామాంజనేయులు అభినందించారు. మరో నాలుగు రోజుల పాటు భక్తులకు అల్పాహారం అందించనున్నట్లు వారు తెలిపారు.

కర్నూలు పీఏబీసీ అధ్యక్షుడిగా సాలోమోన్ రాజు



నూతనంగా ఎన్నికైన పీఏబీసీ నూతన కార్యవర్గ సభ్యులు

కర్నూలు (టౌన్): కర్నూలు పాలం బాప్టిస్టు సంఘముల సమాజం (పీఏబీసీ) నూతన అధ్యక్షుడిగా పి.సాలోమోన్ రాజు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శనివారం స్థానిక ఆ సంఘం కార్యాలయంలో నూతన కార్యవర్గ సమావేశం నిర్వహించారు. కర్నూలు పాలం బాప్టిస్టు సంఘముల సమాజం అధ్యక్షుడిగా ఉన్న పి.రవీంద్ర కుమార్ ఇటీవల మరణించడంతో ఆయన స్థానంలో నూతన అధ్యక్షుడిని ఎన్నుకున్నారు. అలాగే పీఏబీసీ ఉపాధ్యక్షుడిగా పాస్టర్ చంద్రశేఖర్, కార్యదర్శిగా పి.విశ్వకాంత్, కోశాధికారిగా విశ్వరాజు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులు సాలోమోన్ రాజు మాట్లాడుతూ కొత్త కమిటీ నియమ నిబంధనల మేరకు రెండు సంవత్సరాలు కొనసాగుతుందని వెల్లడించారు. కర్నూలు పాలం సమాజం పరిధిలోని ఏబీఎం ఎలిమెంటరీ పాఠశాల, ఉన్నత పాఠశాల, ఈసీఎం, కోల్స్ ఉన్నత పాఠశాల, కోల్స్ కళాశాల, ఎస్టీబీసీ డిగ్రీ కళాశాలలను పర్యవేక్షణ చేస్తామని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో పాస్టర్ రవికుమార్, కరస్పాండెంట్ రజనికుమార్ తదితరులు పాల్గొన్నారు.